అంగన్‌వాడీల సమ్మెబాట

అరకొర వేతనాలతో ఇబ్బందులు
- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సుదీర్ఘ పోరాటం
- గ్రాట్యుటీ పెంచాలని డిమాండ్
- టీచర్లు, ఆయాలు విధులకు గైర్హాజరు


మంచాలలో అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు

ఇబ్రహీంపట్నం: డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు సమ్మెబాట పట్టారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు చాలీచాలని గౌరవ వేతనంతో ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సమస్యలను పరిష్కరించాలని సోమవారం నుంచి సమ్మెకు దిగారు. సీఐటీయూ, ఏఐటీయూసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు బైఠాయించి ఆందోళనను చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు రాములు, ఎల్లేశ్‌లు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు రవీందర్, సీఐటీయూ నాయకులు,అంగన్‌వాడీ కార్యకర్తలుపాల్గొన్నారు.

మంచాల: తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం మంచాల మండల కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్స్ అండర్ హెల్పర్స్ సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి పరిష్కారించాలని డిమాండ్ చేశారు.

యాచారంలో..

యాచారం: పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు రూ. 26 వేలు వేతనం అందజేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ ఉద్యోగులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మెకు దిగారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, యాచారం మండల కన్వీనర్ చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే రెగ్యులర్ చేయాలి

ఆమనగల్లు: అంగన్‌వాడీ కార్యకర్తలను తక్షణమే రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కురుమయ్య డిమాండ్ చేశారు. ఆమనగల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి కురుమయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ లలితకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్షురాలు యాదమ్మ, కార్యదర్శి సుగుణమ్మ, కోశాధికారి అనసూయ, సభ్యులు పద్మ, సంగీత, అలివేలు, రాజ్యలక్ష్మి, అనిత, వెంకటమ్మ, గీత, కళావతి, లక్ష్మి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు


ఆమనగల్లు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


యాచారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

సమస్యలను పరిష్కరిస్తా

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. 11,12,13 వార్డుల్లో సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం రూ.90 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లుకు ఈ నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. అనంతరం కాలనీలో ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు మోహన్‌నాయక్, పద్మమల్లేశ్ యాదవ్, బాలరాజ్, బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

ఇబ్రహీంపట్నం: నెర్రపల్లి గ్రామానికి చెందిన వార్డు మెంబర్ మాధరి సునీతతో పాటు పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమలో ఎంపీపీ కృపేశ్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బుగ్గరాములు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నెర్రపల్లి సర్పంచ్ భాస్కర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

మెరుగైన చికిత్స అందించండి

యాచారం: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్టపై రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేశ్ కుమారులు సాయి, సంపత్‌ను సోమవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. అనంతరం కుటుంబసభ్యులను కిషన్‌రెడ్డి ఓదార్చారు.

గురువులే సమాజ మార్గనిర్దేశకులు


లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

రిటైర్డ్ ఆర్‌జేడీ లక్ష్మారెడ్డి

కడ్తాల్: ఉపాధ్యాయులే సమాజ మార్గనిర్దేశకులు రిటైర్డ్ ఆర్‌జేడీ లక్ష్మారెడ్డి కొనియాడారు. సోమవారం మండల కేంద్రంలోని బటర్‌ఫ్లై సిటీ క్లబ్ హౌస్‌లో, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 6 మండలాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానించారు. సన్మానసభలో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంతో తల్లిదండ్రులతో సమానమైన బాధ్యత గురువులపై ఉంటుందన్నారు. ప్రతి ఏడాది మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానిస్తున్నామని తెలిపారు. ఎంఈవో సర్దార్‌నాయక్‌తో పాటు, 22 మంది ఉత్తమ ఉపాధ్యాయులను క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, క్లబ్ సభ్యులతో కలిసి సన్మానించారు.

ప్లాస్టిక్ రహిత సమాజం అందరి బాధ్యత

తలకొండపల్లి: పర్యావరణానికి, మానవాళికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్‌ను భూ స్థాపితం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని గౌడసంఘం తాలుక కన్వీనర్‌అశోక్‌ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్లాస్టిక్ రహిత సమాజం అందరి బాధ్యత అని చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు.

ఉపాధి కల్పనలో ప్రభుత్వం విఫలం


డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తులను తీసుకుంటున్న రాఘవేందర్‌రెడ్డి

కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలోని యువతీ యువకులకు ఉపాధి కల్పించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తోందని మండిపడ్డారు. మాడ్గులలో సోమవారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ క్యాంపును రాఘవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, కల్వకుర్తి నియోజక వర్గ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, మాడ్గుల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశపతిగౌడ్, నాయకులు జైపాల్‌రెడ్డి, సత్యం, సురేశ్‌గౌడ్, గణేశ్‌గౌడ్, రాంలాల్, సురేశ్, శ్రీను, శంకర్‌నాయక్, శివగౌడ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో దీక్ష


ఇబ్రహీంపట్నంలో దీక్ష చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నేతలు

ఇబ్రహీంపట్నం: అగ్రవర్ణాల పెత్తనాన్ని సహించేది లేదని ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఒక రోజు నిరసన దీక్షను సోమవారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడు శాతమున్న రెడ్డి, వెలమ,కమ్మ సామాజికవర్గానికి చెందిన నాయకులే కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం పార్టీలకు అధ్యక్షులుగా ఉన్నారన్నారు. ఏ పార్టీ రాష్ట్రంలో గెలిచిన రెడ్డి, వెలమ, కమ్మలే రాజ్యమేలుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 93 శాతమున్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతోందని, రాజకీయాల్లో వీరికి సమానవాటా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు రవీందర్, శేఖర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఎర్రజెండా


సాయుధ పోరాట వారోత్సవాల్లో పాల్గొన్న సీపీఐ నాయకులు

తుర్కయంజాల్: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం కొనసాగిందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య అన్నారు. సోమవారం తుర్కయంజాల్ చౌరస్తాలో సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 4వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారని, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత ఎర్రజెండాకు ఉందని గుర్తు చేశారు. సాయుధ పోరాటంతో సంబంధంలేని కొన్ని పార్టీలు చరిత్రను వక్రీకరిస్తున్నాయని ఆరోపించారు. పేదలకు అండగా ఎర్రజెండా నిలిచిందని తెలిపారు. ఈ నెల 17వ తేదీన వారోత్సవాల ముగింపు సభను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి. శివకుమార్, నాయకులు రాజు, గోవర్ధన్, శివకుమార్, ఆనంద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రేపు క్రీడాకారుల ఎంపిక

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం జోనల్ స్థాయి అండర్ 14, అండర్ 17 బాలుర క్రికెట్ టోర్నమెంట్‌కు క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని బుధవారం స్థానిక గురుకుల విద్యాపీఠ్‌లో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రటరీ దేవదాసు తెలిపారు. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల విద్యార్థులు ఈ పోటీలకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు తమ బోనాఫైడ్, ఆధార్ కార్డు, మార్క్స్ మెమో జిరాక్స్ పత్రాలతోపాటు క్రికెట్ సామాగ్రితో ఈ సెలక్షన్‌కు హాజరుకావాలని కోరారు. వివరాలకు 9866691079, 9701505657, 9989647521 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండల ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్స్‌పల్ డాక్టర్ లావణ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బీపీసీ, సీఈసీ, ఎంఈసీలో చేరడానికి స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 16వ తేదీన విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు. అలాగే 6–9 తరగతుల్లో కూడ ఖాళీలు భర్తీకి స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు బీఆర్‌ఎస్ నాయకుల సమావేశం

కందుకూరు: జిల్లెలగూడ ఎస్‌వైఆర్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించనున్న మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మంత్రి సబితారెడ్డి హాజరుకానున్నారని తెలిపారు.

కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ రామిడి మల్లారెడ్డి కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీ సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా రామిడి శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బి.శివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి జూపల్లి కుమార్, కార్యదర్శి వెంకటేశ్, గౌరవ సలహాదారులుగా లింగారెడ్డి, కృష్ణారెడ్డి, మల్లారెడ్డిలను ఎన్నుకున్నారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డిని కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తుఫాన్ రెడ్డి, ముత్యంరెడ్డి, సుభాష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చారి, పుల్లారావు, కృష్ణమోహన్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, మధుసూదన్‌శర్మ, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉదయనిధి వ్యాఖ్యలు దురదృష్టకరం


తుక్కుగూడలో ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

తుక్కుగూడ: హిందు సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను అరెస్టు చేయాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి, స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, కౌన్సిలర్లు వై.శివకుమార్, ఆర్.రాజు, బి. విలాస్, నాయకులు కృష్ణగౌడ్, సుధాకర్, శివయ్యగౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు


బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న సర్పంచ్, మహిళలు తదితరులు


చింతలపల్లిలో బోనాల పండుగలో పాల్గొన్న వెంకటేశ్, పత్యానాయక్ తదితరులు

తలకొండపల్లి: మండలంలోని చంద్రధనలో ఆదివారం రాత్రి, సోమవారం కోట మైసమ్మ, పోతరాజు, పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ప్రజలు బోనాల ఉత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నైవేద్యం అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శివసత్తుల ఆటపాట, పోతరాజుల విన్యాసాలు పలువురిని అలరించాయి. కన్నుల పండువగ కొనసాగిన ఈ కార్యక్రమాల్లో కేశంపేట్, షాద్‌నగర్, మిడ్జిల్, జడ్చర్ల, మహబూబ్‌నగర్ తదితర పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా సర్పంచ్ కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజు, దామోదర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ప్రసాద్, యాదయ్య, రామకృష్ణారెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామంలో సోమవారం ప్రజలు బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవంలో జెడ్పీటీసీ అనురాధ, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, సర్పంచ్ మంజులయాదయ్య, స్థానిక నాయకులు నిరంజన్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని మంగళపల్లి గ్రామంలో ప్రజలు బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, సర్పంచ్ తిప్పిరెడ్డి నర్సింహరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో పూజలు

కడ్తాల్: మండలంలోని పోచమ్మ ఆలయంలో సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రజాప్రతినిధులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి అభిషేకంతో పాటు ఇతర కార్యక్రమాలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, ఆలయ చైర్మన్ సత్యంయాదవ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్ గ్రామస్తులు ఉన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మండల కేంద్రంతో పాటు, ఎడవల్లిలో పోచమ్మ, మైసమ్మ బోనాలను సోమవారం ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బియ్యం, బెల్లం, పప్పులతో వండిన నైవేద్యం అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామాలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. బాజా భజంత్రీలు, డప్పుల చప్పుళ్ల మధ్య పోతురాజు విన్యాసాలు, శివసత్తుల ఆట పాటలు, నృత్యాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదయ్య, శేఖర్, సర్పంచ్ కిష్టమ్మ, మహిళలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోషకాహారం.. ఆరోగ్య సోపానం


పోషణ మాసోత్సవంలో పాల్గొన్న తల్లీబిడ్డలు

తుర్కయంజాల్: పౌష్టికాహారం తీసుకున్నప్పుడే తల్లీ బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని ఇంజాపూర్‌లోని అంగన్‌వాడీ టీచర్ ఉమారాణి అన్నారు. పోషణ మాసోత్సవంలో భాగంగా సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాజా కూరగాయలు, పండ్లు, పాలు, చేపలు, గుడ్లు, పప్పు దినుసులు వంటి ఆహారం తీసుకోవాలని సూచించారు. పోషకాహారం ఆరోగ్య సోపానమని పేర్కొన్నారు. తల్లీబిడ్డల సంక్షేమం కోసం ప్రభుత్వం పౌష్టికాహారం అందించడంతో పాటు, అనేక కార్యక్రమాలు చేపడుతోందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు దీక్షలు

జేఏసీ నాయకుడు దామోదర్


గట్టుఇప్పలపల్లిలో దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి: ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు దీక్షలు కొనసాగుతాయని జేఏసీ నాయకుడు దామోదర్ ప్రకటించారు. గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 71వ రోజుకు చేరుకున్నాయి. మండలం ఏర్పాటు అయ్యే వరకు దీక్షలు కొనసాగుతాయని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు డేవిడ్, మల్లేశ్, వినోద్, బాబు, అంజయ్య, బుచ్చయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుకు చేయూత


స్వాతికి ఆర్థిక సాయం అందజేస్తున్న జెడ్పీటీసీ తదితరులు

తలకొండపల్లి: విద్యార్థుల చదువులకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, ఉప్పల ట్రస్టు చైర్మన్ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూత నందిస్తున్నాడు. హైదరాబాద్‌లోని బ్రిలియంట్ విద్యా సంస్థల్లో స్వాతి అనే విద్యార్థిని డిప్లొమా చదువుతోంది. అయితే ఆర్థిక ఇబ్బందుల వల్ల కళాశాల ఫీజులు చెల్లించలేక విద్యార్థిని తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. విద్యాభ్యాస్యాన్ని కొనసాగించేందుకు ఆర్థిక సాయం చేయాలని స్వాతి ఉప్పల ట్రస్ట్ చైర్మన్‌ను ఆశ్రయించింది. దీంతో సోమవారం హైదరాబాద్‌లో రూ. 15,000 చెక్కును వెంకటేశ్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, విజయ్ కుమార్, తిరుపతయ్యగౌడ్, శ్రీను, రాజు, నరసింహ, వెంకటయ్య, బుచ్చిబాబు, అశోక్, మధు తదితరులు పాల్గొన్నారు.

హైబిజ్ టీవీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం


విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న నిర్వాహకులు

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని కుంట్లూర్ పల్లవి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు హైబిజ్ టీవీ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డులను పొందారు. ఈ మేరకు నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రముఖ క్రికెటర్ అంబటిరాయుడు, టెన్నీస్ క్రీడాకారిని నైనా జైస్వాల్ చేతుల మీదుగా విద్యార్థులు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతో పాటుగా క్రీడలపై కూడా విద్యార్థు లు శ్రద్ధ పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నవీన్‌కుమార్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అనీల్‌కుమార్, ఆదిత్యా మ్యూజిక్ అధినేత దినేష్‌గుప్తా, హైబిజ్ టీవీ ఎండీ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలో బూర నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో సోమవారం జరిగిన బీజేపీ గిరిజన మోర్చా స్థానిక నాయకుడు బాలు నాయక్ జన్మదిన వేడుకలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి.. శుభాకాంక్షలు తెలిపారు.